
సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 4 । మార్చి । 2025



శ్రీరామ రామ రామేతి..!

సంతకవిటి మండలం గుళ్ల సీతారాపురంలో వెలసిన సీతారాముల ఆలయానికి 500 ఏళ్ల చరిత్ర ఉంది.

- 8లో



ఘనంగా రెండోరోజు జాతర

చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర రెండోరోజు సోమవారం వైభవంగా సాగింది.

- 8లో



ఇఫ్తార్	సహార్
మంగళ (సా)	బుధ (ఉ)
6.06	5.04

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

అందుబాటులో హాల్ టికెట్లు



పార్వతీపురంటౌన్: పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుపతినాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, మీడియం, విద్యార్థి ఫొటో, సంతకం, సబ్జెక్టు వివరాలు నిశితంగా పరిశీలించి తప్పులు గమనిస్తే వెంటనే గౌరవ సంచాలకులు, ప్రభుత్వ పరీక్షల విభాగాన్ని సంప్రదించాలన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌లను వాట్సాప్ ద్వారా పొందే వెసులబాటు ఉందన్నారు.

లింగ నిర్ధారణ చేసేవారిపై కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: లింగ నిర్ధారణ చేసేవారితో పాటు, సంబంధిత అంశంపై వాణిజ్య ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగ్‌లు పెట్టేవారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి హెచ్చరించారు. జిల్లా వైద్యశాఖ పరిధిలో నమోదైన ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. సీపీపీఎన్‌డీటీ యాక్టును అతిక్రమిస్తే మూడు నుంచి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు జరిమానా తప్పదన్నారు.

సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

- ఈ నెల 10వ తేదీలోపు గడువు
- డీఈఓ యు.మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ కింద పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయ/ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఈఓ యు.మాణిక్యంనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్) రూపొందించిన ఈ జాబితాపై ఎలాంటి అభ్యంతరాలున్నా ఈ నెల 10వ తేదీలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. అభ్యంతరం చేసే ఉపాధ్యాయుని పూర్తి పేరు, పనిచేస్తున్న కేడర్, అభ్యంతరం చెబుతున్న వివరాలు వివరించాలి. సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలి. ఆధారాలు లేదా సంబంధిత సాక్ష్యాలు విధిగా జతచేయాలి. పూర్తి వివరాల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాయంలో సంప్రదించవచ్చని తెలియజేశారు.

రోడ్డు పనులకు సహకరించండి

- అటవీశాఖ అధికారులకు ఎస్టీ కమిషన్ చైర్మన్ సూచన



విజయనగరం అర్బన్: అల్లూరి జిల్లా అనంతగిరి మండలం చిన్నకోనల గిరి శిఖర గ్రామ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అధికారులు సహకరించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు కోరారు. రోడ్డు పనులను అటవీశాఖాధికారులు అడ్డుకుంటున్నారంటూ గిరిజనుల నిరసన తెలపడంపై ఆయన సోమవారం స్పందించారు. నాన్ షెడ్యూల్ ఏరియాలోని రొంపల్లి పంచాయతీ పరిధి కొండశిఖర గ్రామాలైన చిన్నకోనల, భూరిగా, వనిజతో పాటు ఎస్.ఆర్.పురం పంచాయతీ పరిధిలోని మరో ఐదు గ్రామాలను కలుపుతూ వేసే రోడ్డు నిర్మాణంపై అటవీశాఖ అభ్యంతరాలను నివేదిక రూపంలో అందజేయాలని సంబంధిత అధికారులను కోరారు. గిరిజనులకు మౌలిక సదుపాయాల కల్పనపై అలసత్వం వహించరాదన్నారు.

బొబ్బిలిలో నిలిచిన గూడ్స్‌రైలు



ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

బొబ్బిలి: సాంకేతిక సమస్య కారణంగా బొబ్బిలి-డొంకినవలస రైల్వేస్టేషన్‌ల మధ్య ఓ గూడ్స్‌రైలు సోమవారం సాయంత్రం నిలిచిపోయింది. దీంతో బొబ్బిలి రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణించాల్సిన విశాఖ-కొరాపుట్ రైలుతో పాటు పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గంట కాలం పాటు రైలు అలాగే ఉండిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. స్పందించిన రైల్వే అధికారులు.. కొరాపుట్ రైలుకు వేరే ఇంజిన్ తెప్పించి, రైలును కదిలించే ప్రయత్నం చేశారు.

కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు



రఘువర్మకు మద్దతుగా సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద కూర్చున్న మంత్రి సంధ్యారాణి (ఫైల్)



గాదె శ్రీనివాసులు నాయుడు విజయ సంకేతం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరాజయం
- అప్రజాస్వామ్య పాలనపై మేధావుల తీర్పు
- మరోసారి పెద్దల సభకు గాదె శ్రీనివాసులునాయుడు
- ఉత్కంఠ పోరులో మూడోసారి ఎమ్మెల్సీగా గెలుపు
- టీడీపీ, జనసేన నాయకులు సర్వశక్తులు ఒడ్డినా తప్పని రఘువర్మ ఓటమి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

టీడీపీ ఎమ్మెల్సీ చిరంజీవి వ్యూహాలు... మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి ముక్తాయింపులు... టీడీపీ ఎమ్మెల్యేలు కళావెంకటరావు, బేబీనాయన, అదితి గజపతిరాజు ఒడ్డిన సర్వశక్తులు, కోళ్ల లలితకుమారి, విజయచంద్ర తదితర కూటమి ఎమ్మెల్యేల సముదాయింపులు, బెదిరింపులు, లాలింపులు, తాయిలాలు, తాలింపులు... ఇవేవీ ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించలేకపోయాయి. సార్వత్రిక ఎన్నికలను తలపించేలా ప్రతి ఎమ్మెల్యే, మండల స్థాయి నాయకులు ఎంత ప్రచారం చేసినా, చివరకు పోలింగ్ రోజున కేంద్రాల ముందు శిబిరాలు తెరిచి కూర్చున్నా వారి ప్రయత్నాలన్నీ మేధావుల నిర్ణయం ముందు తేలిపోయాయి. అధికారం అప్పగించి తొమ్మిది నెలల్లోనే అరాచకాలతో, అప్రజాస్వామిక పాలన సాగిస్తున్న టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వానికి తమ ఓటుతో బుద్ధి చెప్పారు. ఒకవైపు పలు ఉపాధ్యాయ సంఘాల ప్రత్యక్ష మద్దతు, వైఎస్సార్‌సీపీ పరోక్ష మద్దతుతో పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు ఘన విజయం సాధించారు. పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి కూడా గట్టి పోటీ చేశారు. వీరిద్దరికీ కలిపి ప్రథమ ప్రాధాన్య ఓట్లలో సుమారు 70 శాతం వరకూ రాగా, కూటమి ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డినా ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు రమారమి 30 శాతం ఓట్లే దక్కాయి. అధికార దర్పంతో విర్రవీగుతున్న 'రెడ్‌బుక్' ప్రభుత్వానికి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఇచ్చిన తీర్పు ఒక చెంపపెట్టు వంటిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైంది...

టీడీపీ, జనసేన పార్టీలు బలపర్చిన సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కన్నా ఆయన సమీప ప్రత్యర్థులిద్దరికీ దాదాపు 70 శాతం టీచర్లు మద్దతు పలికారంటే తొమ్మిది నెలల్లోనే ప్రజాభిప్రాయంలో ఎంత మార్పు వచ్చిందో అర్థమవుతోంది. రఘువర్మ తరఫున ఆ పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు, మంత్రులు ప్రత్యక్షంగా ప్రచారం చేసి, పోలింగ్ కేంద్రాల ముందు స్లిప్పులు పంచినా తీర్పు మాత్రం కూటమి ప్రభుత్వానికి చెంపదెబ్బ కొట్టినట్లు చెప్పారు. ఇక్కడితో కౌంట్‌డౌన్ మొదలైంది.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

మూడోసారి గాదెకు అవకాశం...

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యునిగా డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు ఎన్నిక సోమవారం రాత్రి 10 గంటలకు ఖరారైంది. గతంలో రెండు సార్లు ఉపాధ్యాయ శాసనమండలికి ప్రాతినిధ్యం వహించిన ఆయనకు ఆరేళ్ల విరామం తర్వాత మరోసారి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయులు అవకాశం ఇచ్చారు. విజయనగరం జిల్లాలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ ఉపాధ్యాయ, విద్యారంగంలోని సమస్యలపై పోరాడుతూ వచ్చిన గాదె ఉత్తరాంధ్ర సుపరిచితులు. పీఆర్‌టీయూ సంఘానికి జిల్లా, రాష్ట్రస్థాయి నాయకత్వం వహించారు. వాస్తవానికి గాదె పూర్వీకులది అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలంలోని జోగింపేట గ్రామం. ఉద్యోగరీత్యా ఆయన తండ్రి వెంకునాయుడు విజయనగరం జిల్లాకు నివాసం వచ్చేశారు. జిల్లా పరిషత్ సీఈవోగా ఉమ్మడి (శ్రీకాకుళం, విజయనగరం) జిల్లాలో పనిచేశారు. అలా జిల్లాతో అనుబంధం ఏర్పడిన శ్రీనివాసులనాయుడు తన పాఠశాల విద్యను విజయనగరం, గజపతినగరం ప్రాంతాల్లోనే సాగించారు. ఉన్నత విద్య విషయానికొస్తే ఆయన ఎమ్మెస్సీ, ఎంటెక్, బీఈడీ, ఎంఏ (ఎడ్యుకేషన్) పూర్తి చేశారు. విద్యారంగంపై పరిశోధన చేశారు. పీహెచ్‌డీ పట్టాతో డాక్టర్ శ్రీనివాసులనాయుడు అయ్యారు. 2007, 2013 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుసగా రెండు దఫాలు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ హక్కుల సాధనలో ఆయన కృషిని ఉపాధ్యాయులు గుర్తించారు.



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఓటరు స్లిప్పును స్వయంగా అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర (ఫైల్)

ఉత్తరాంధ్ర వేదికగా తిరుగుబాటు...

కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు ఉత్తరాంధ్ర వేదికగా తిరుగుబాటు మొదలైంది. తొలుత ఆ బాధ్యతను మేధావివర్గం భుజానకెత్తుకుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నడూ కనిపించిన రాజకీయ జోక్యాన్ని కలిసికట్టుగా తిప్పికొట్టారు. ప్రజావ్యతిరేక పాలన సాగిస్తే ఓటుతో బుద్ధిచెబుతారని తెలియజెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా ప్రజా, ఉద్యోగ వ్యతిరేక పాలన సాగిస్తూ, కక్షపూరిత రాజకీయాలకు తెరతీసిన కూటమి ప్రభుత్వం ఇక రోజులు లెక్కపెట్టుకోవాల్సిందేనన్న సంకేతాన్ని మేధావివర్గం ఇచ్చిందన్న చర్చ పల్లెలు, పట్టణాల్లో జోరందుకుంది.

ఉపాధ్యాయ సంఘాల మద్దతు...

రఘువర్మ పదవీకాలం పూర్తికావడంతో జరిగిన ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి శ్రీనివాసులనాయుడు బరిలో నిలిచారు. ఆయనకు ఏపీటీఎఫ్ (1938), ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్), రాష్ట్రీయ ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ), ఆర్‌యూపీపీ, బీటీఏ, ఏపీటీయూ (ఎయిడెడ్), ఏపీటీజీ (ఎయిడెడ్), టీఆర్‌ఈఐఎల్‌ఏ, టీఆర్‌ఈఐటీఏ, జీజీటీఏ, ఏపీజీటీడబ్ల్యూఆర్ఎస్, ఏటీఏ, ఎస్‌డబ్ల్యూఈఎఫ్-ఏపీ, ఏపీటీడబ్ల్యూఏహెచ్ఎస్, ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలు, ఏపీపీటీ, పీఈటీ, పీడీ, పీటీఎల్ఎఫ్, ఏపీఎంపీఎస్‌టీయూ తదితర సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఆయన ముచ్చటగా మూడోసారి శాసనమండలిలో అడుగు పెట్టడానికి సహకరించాయి.

సంతోషంగా ఉంది



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులనాయుడు గెలవడం సంతోషంగా ఉంది. ఇది కూటమి ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిది. ఇకనైనా ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి.

– అమరపు సూర్యనారాయణ, పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు



గాదె గెలుపు ప్రకటనతో బాడంగి మండల ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మిఠాయిలు పంచుకొని హర్షంవ్యక్తంచేస్తున్న ఉపాధ్యాయులు

సంక్షేమ పాలనకు చిరునామా జగన్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

- రోడ్లు వేసినది ఎవరో ఏజెన్సీ ప్రాంత గిరిజనులను అడితే చెబుతారు
- అబద్ధాలు చెప్పినంత సులభం కాదు పనులు చేయడం
- ప్రజల్లోకి వెళ్తే కూటమి పాలన ఎలా ఉందో తెలుస్తుంది..
- కూటమి ప్రజావ్యతిరేక పాలనను తిప్పికొట్టిన మేధావి వర్గం
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సాలూరు రూరల్: సంక్షేమ పథకాలు, జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ఏకైక హీరో మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని, ఆయన పాలన సంక్షేమానికి చిరునామాగా పేరొందిందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సాలూరులోని రాజన్నదొర ఇంటి వద్ద సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అబద్ధాలు చెప్పడంలో కూటమి నేతలు ఆరితేరిపోయారన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేశ్ జాబ్, సంక్షేమ క్యాలండర్ విడుదల చేస్తామని చెప్పిన విషయం నిరుద్యోగులు, ప్రజలకు గుర్తుందన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తారని ప్రజలు ఇప్పటికీ ఆశగా ఎదురు చూస్తున్నారని, తక్షణమే పథకాలు అందజేయాలన్నారు. ప్రస్తుతం పేదలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. 2014లో రైతు రుణమాఫీ కింద రూ.87వేల కోట్లు బ్యాంకులకు కట్టాల్సి ఉండగా కేవల రూ.20వేల కోట్లు కట్టిన చంద్రబాబునాయుడు.. మరోసారి రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని మోసం చేశారన్నారు. మహిళలకు రూ.12వేల కోట్లు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మోసం చేయడంతో వడ్డీతో కలిపి రూ.25వేల కోట్లను నాలుగు దఫాలుగా గత జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెల్లించిన విషయం అందరికీ గుర్తుందన్నారు. 41లక్షల మంది తల్లులకు అమ్మవడి అందించిన ఘనత జగన్ మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వరరావు, ఎం.తులసిరెడ్డి వంటి మేధావులు కూటమి ప్రభుత్వం కంటే గత జగన్ ప్రభుత్వం మేలు చేసిందని చెబుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావి వర్గం గట్టిగా తిప్పికొట్టిందన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు అబద్ధాలు చెప్పడం మాని వాస్తవాలకు దగ్గరగా పాలన అందించాలని హితవు పలికారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

- జూన్ మాసాంతం వరకు నిరంతరం తాగునీరు సరఫరా కావాలి
- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం టౌన్: ప్రస్తుత వేసవి కాలంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారుల ను ఆదేశించారు. జూన్ మాసాంతం వరకు నిరంత రం తాగునీరు సరఫరా చేసేలా ముందస్తు ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. సమస్యతలెత్తితే సంబంధిత ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ఎద్దడి ఉన్నచోట బోర్లు వేసేందుకు, పాడైనవి బాగుచేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు/ఐటీడీఏ/ జెడ్పీ నిధులు వినియోగించుకోవాలని సూచించా రు. ఎక్కడైనా తాగునీటి సమస్యలు తలెత్తితే సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. పీఎం సూర్యఘర్ యూనిట్లను అధిక మంది వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం జన్‌మన్, పీఎంఏవై 2.0 కింద నిర్మితమవుతున్న గృహాలపై ఐటీడీఏ పీఓలు ప్రత్యే క శ్రద్ధ కనబరచాలన్నారు. జిల్లాలో 94 సెల్ టవర్ల ఏర్పాటుకు బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్టెల్ నెట్ వర్క్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని, టవర్లులేని ప్రాంతాలను గుర్తించి గురువారం నాటికి నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఐటీడీఏ పీఓలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, హౌసింగ్, డ్వా మా, డీఆర్డీఏ, ఐసీడీఎస్ పీడీలు ధర్మచంద్రారెడ్డి, కె. రామచంద్రరావు, వై.సత్యంనాయుడు, టి.కనకదు ర్గ, సీపీఓ పి.వీర్రాజు, డీపీఓ టి.కొండలరావు, జిల్లా ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు, జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతయ్య, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎస్.కృష్ణ, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.చలపతిరావు, డీఎస్డీఓ కె.సాయికృష్ణచైతన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన అవసరం

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎంవీవీ శ్రీనివాస్

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయ పద్ధతులను విద్యార్థులు తెలుసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎంవీవీ శ్రీనివాస్ తెలిపారు. ఏరువాక కేంద్రంలో సోమవారం గ్రామీణ వ్యవసాయ అవగాహన అనుభవ కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందుతున్న నైరా కళాశాల వ్యవసాయ విద్యార్థులతో సమావేశమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి రైతులు వివిధ పంటల్లో అవలంబిస్తున్న పద్ధతులను తెలుసుకోవాలన్నారు. వారికి తెలియని విషయాలను తెలియజేయాలన్నారు.

పెట్టుబడిదారులను స్వాగతిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అసక్తికలిగిన పెట్టుబడిదారులను స్వాగతిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా పర్యాటక అభివద్ధి మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రీసార్ట్స్, బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, లోటస్ గార్డెన్ ఏర్పాటుకు ముందుకు వచ్చే పెట్టుబడిదారులను స్వాగతిస్తామని, వారికి కావలసిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామన్నారు. తోటపల్లి, వెంగళరాయసాగరం, పెద్దగెడ్డ వంటి రిజర్వాయర్లలో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటివి ఏర్పాటు చేయవచ్చన్నారు. తోటపల్లి వద్ద ఉన్న ఐటీడీఏ పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. ఆడలి వ్యూపాయింట్ వద్ద రక్షణ గోడలు, రహదారి పనులు, రెండు గదుల నిర్మాణాలు వీలైనంత త్వరగా పూర్తి కావాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ స్పష్టంచేశారు. పార్వతీపురంలో బడ్జెట్ హోటల్ నిర్మాణానికి ముందుకు వచ్చిన పెట్టుబడిదారులకు స్థలాన్ని అప్పగిస్తామని, ప్రభుత్వం రాయితీలను ప్రకటించిందని కలెక్టర్ గుర్తుచేశారు. అరుకు-సాలూరు-పార్వతీపురం మీదుగా మందస వరకు గల సర్క్యూట్ టూరిజంను వీలైనంత త్వరగా ప్రతిపాదనలు పంపి ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ పీఓలతోపాటు డీపీఓ టి.కొండలరావు, అడ్వంచర్ అండ్ వాటర్ స్పోర్ట్స్ డైరెక్టర్ బి.బలరాంనాయుడు, నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు ఆర్.అప్పలనాయుడు, తోటపల్లి రిజర్వాయర్ ఉపకార్యనిర్వాహక ఇంజినీరు టి.రఘునాథనాయుడు, దేవదాయ శాఖాధికారి యస్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు కట్..!



రేషన్ షాపుల్లో పేదలకు అందించే కందిపప్పు (ఫైల్)

- రేషన్ లబ్ధిదారులకు నిలిచిన కందిపప్పు సరఫరా
- కూటమి ప్రభుత్వ తీరుపై విమర్శల వెల్లువ
- మార్చినెలకు విడుదలకాని కందిపప్పు
- జిల్లాలో రైస్‌కార్డులు 5,71,354
- 571.354 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం
- లబ్ధిదారులకు బియ్యం, పంచదార మాత్రమే సరఫరా

విజయనగరం ఫోర్ట్: కూటమి ప్రభుత్వ పాలనలో రేషన్ లబ్ధిదారుల 'పప్పు'లుడకవిక. పేదలకు సరఫరా చేసే కందిపప్పు సరఫరాకు ఎసరు పెట్టింది. కేవలం బియ్యం, పంచదార సరఫరాకే ప్రజాపంపిణీ వ్యవస్థను పరిమితం చేసింది. ఎన్నికలవేళ అలవికాని హామీలిచ్చిన కూటమి నేతలు గద్దెనెక్కాక ఒక్కొక్కదానిని తుంగలో తొక్కడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం పేరిట రూ.15 వేలు చొప్పున అందిస్తామని చెప్పారు. విద్యా సంవత్సరం ముగిసిపోతున్నా ఆర్థిక సాయం సున్నాగానే మిగిలింది. రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ పథకంగా పేరుమార్చి రైతులకు ఏమార్చారు. పైసా సాయం అందజేయకుండా కష్టాల్లోకి నెట్టారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం ఉత్తుత్తిదే అని తేల్చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని చెప్పారు. ఒక్కరికీ ఇచ్చిన దాఖాలా లేవు. నిరుద్యోగ భృతి ఎండమావిగానే మారింది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అన్ని సరుకులు ప్రజలకు అందిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందించే సరుకుల్లోనూ కోత విధిస్తువస్తున్నారు. గత కొద్ది నెలలుగా కందిపప్పులో కోత విధిస్తున్న కూటమి సర్కారు మార్చి నెలకు ఏకంగా మంగళం పాడేయడంపై మండిపడుతున్నారు. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని పాలన ఎందుకంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. అమరావతిని కట్టేస్తే పేదల కడుపునిండుతుందా అని ప్రశ్నిస్తున్నారు. పెద్దల లబ్ధికోసం పేదలకు కేటాయించాల్సిన డబ్బులన్నీ రాజధాని నిర్మాణం పేరుతో జేబుల్లోవేసుకుంటున్నారని విమర్శిస్తున్నారు.

ఇదీ పరిస్థితి...



జిల్లాలో తెలుపు రేషన్‌కార్డు దారులు 5,71,354 మంది ఉన్నారు. వీరికి నెలకు 571.354 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలు జీవనానికి ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.180 పలుకుతున్న కందిపప్పును కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి గతంలో వలే కిలో రూ.67 చొప్పున రాయితీపై అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సరఫరా కాలేదు..



రేషన్ కార్డుదారులకు మార్చినెలకు సరఫరా చేసేందుకు కందిపప్పు సరఫరా కాలేదు. జిల్లాకు నెలకు 571.354 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం పడుతుంది. ఈ నెల బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేస్తాం.

– కె.మధుసూదనరావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

క్లుప్తంగా

భక్తి మార్గం అనుసరణీయం

- మాజీ ఎంపీ బెల్లాన



మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు ఘనంగా స్వాగతం పలుకుతున్న సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్య, గ్రామస్తులు

వంగర: ప్రజలు భగవన్నామస్మరణతో మెలిగి భక్తిమార్గాన్ని అనుసరణీయంగా భావించాలని విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వంగర మండల పరిధి గీతనాపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీరామాలయం పునఃప్రతిష్ఠ, శ్రీఆంజనేయస్వామి ఆలయం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నెయిగాపుల శివరామకృష్ణయ్య, నెయిగాపుల ప్రసాదరావులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ నాయకులు యలకల వాసునాయుడు, కిమిడి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు



సెంచూరియన్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సంస్థ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నాగ్‌పూర్‌కు చెందిన కోడ్ ఎఫ్ సొల్యూషన్స్ సంస్థ సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఫోరెన్సిక్ అనలిస్ట్, ఫోరెన్సిక్ ట్రైనీ, ఇన్వెస్టిగేటర్, క్రైమ్ ఆఫీసర్స్, తదితర ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శుభం రాజేంద్ర సాహు మాట్లాడుతూ బీఎస్సీ, ఎమ్మెస్సీ ఫోరెన్సిక్‌లో మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కాలంలో రూ.10వేలు స్టైపెండ్ అందిస్తామన్నారు. ఇంటర్న్‌షిప్ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ హెడ్ శుభాంగి నీల్‌కాంత్ నిఖారే పాల్గొన్నారు.

గొర్రెపోతుల పందాలపై పోలీసుల దాడి



గొర్రెపోతులతో పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

లక్కవరపుకోట: మండలంలోని ఖాసాపేట గ్రామం సమీపంలో గల తోటల్లో రహస్యంగా నిర్వహిస్తున్న గొర్రెపోతుల పందాలపై ఎస్సై నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా పందెం నిర్వహిస్తున్న ఐదుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2వేలు, రెండు గొర్రెపోతులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో జేఎల్‌ఎం మృతి



కరణం సత్యం (ఫైల్)

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురం సమీపంలో విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారిలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని పేరిపి గ్రామానికి చెందిన కరణం సత్యం(48) మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం పేరిపి గ్రామానికి చెందిన కరణం సత్యం ఆర్ఈసీఎస్‌లో చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస జూనియర్ లైన్‌మన్(జేఎల్ఎం)గా పనిచేస్తున్నాడు. అయితే పట్టణంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో మూడు రోజులు నిరంతర విద్యుత్ సరఫరాలో భాగంగా ఉన్నతాధికారులు జేఎల్‌ఎంలకు చీపురుపల్లిలో అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో విధి నిర్వహణలో భాగంగానే సత్యం ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తరువాత చీపురుపల్లి నుంచి గరివిడి వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న పాలవ్యాన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య సుజాత, కుమారుడు ఉన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹200	210



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బేడా

కోదండ రాముడంట కొమ్మలాల..
కౌసల్య కొమారుడంట కొమ్మలాల..
కల్యాణ రాముడిని కన్నులారా చూడాలని..కోరుకోని భక్తులుండరంటే అతిశయోక్తి కాదు. పురాణాల్లో ఆదిదంపతులుగా పూజలందుకుంటున్న సీతారాముల దర్శనానికి సంతకవిటి మండలంలోని గుళ్ల సీతారాంపురం గ్రామానికి వెళ్లాల్సిందే.

– సంతకవిటి

శ్రీరామ రామ రామేతి..!

- అజరామరం గుళ్ల సీతారాంపురంలోని ఆలయం
- 500 ఏళ్ల చరిత్ర కలిగిన సీతారాముల ఆలయం
- ఆలయంలో అంగరంగ వైభవంగా డోలోత్సవం నిర్వహణ



గాలిగోపురం



ఏకాంత సీతారాములు



ప్రధాన ఆలయం



ధ్వజస్తంభం

రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి మండలంలో గల గుళ్ల సీతారాపురం గ్రామంలో వెలసిన సీతారాముల ఆలయానికి 500 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ఆలయంలో సీతారాములు స్వయంభూగా వెలిశారు. ఆనాడు ఈ ప్రదేశం నిర్మానుష్యంగా ఉండడంతో ఆలయం నిర్మాణంతో పాటు గ్రామం నిర్మించారు. సీతారాంపురం గ్రామాలు ఎక్కువగా ఉండడంతో గుడి సీతారాంపురంగా ఈ గ్రామాన్ని పిలిచేవారు. కాలక్రమేణా అది గుళ్ల సీతారాంపురంగా రూపాంతరం చెందింది. ఈ ఆలయానికి బొబ్బిలి రాజులు వంశపారంపర్యంగా ధర్మకర్తలుగా కొనసాగుతున్నారు. ఈ ఆలయం మొత్తం రాళ్ల పేర్పుతో నిర్మించిన అద్భుత కట్టడం. ఈ ఆలయంలో గాలిగోపురం దాదాపు 65 అడుగుల పొడవు ఉంటుంది. గాలిగోపురం పైకి ఎక్కితే బొబ్బిలిలోని వేణుగోపాలుని ఆలయం గాలిగోపురం కనిపిస్తుందని ప్రాశస్త్యం. స్వయంభూగా వెలిసిన ఇక్కడి సీతారాములు ఏకాంతవాసంలో ఉన్నట్లు ఏకశిలపై ఉండడం విశేషం. ఏ ఆలయంలో అయినా సీతారాములతో పాటు లక్ష్మణుడు, ఆంజనేయుడు ఉంటారు. కానీ ఈ ఆలయంలో లక్ష్మణుడు, ఆంజనేయుడు, శంఖుచక్రాలు, ధనుర్బాణాలు ఉండవు. ఈ ఆలయం గోడలపై చెక్కిన శిల్పాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. ప్రధాన ఆలయం చుట్టూ బేడాను ఏర్పాటు చేశారు. ఈ బేడాను అనుసరించి ఆళ్వారులు, రాధాకావతులు, రామానుజుల వారు, నమ్మాళ్వాల్, గరుడాళ్వాల్, మానవాళ్ల మహాముని, దాసాంజనేయులకు ప్రత్యేకంగా సన్నిధులను ఏర్పాటు చేశారు.

ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం జేష్ఠ శుద్ధ ఏకాదశినాడు ఉదయం రాధాకాంతుల కల్యాణం, రాత్రి సీతారాముల కల్యాణం, శ్రావణ శుద్ధ ఏకాదశి నాడు పవిత్రోత్సవాలు, 30 రోజులపాటు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు భోగాపురపు ప్రసాదరావు తెలిపారు.

అంగరంగ వైభవంగా డోలా పౌర్ణమి

ఫాల్గుణ శుద్ధ పౌర్ణమినాడు(డోలా పౌర్ణమి) స్వామి వారిని ఆంజనేయ వాహనం, సర్ప వాహనంపై ఊరేగింపుగా ఉత్తర ముఖ మంటపానికి వేంచేసి భక్తకోటి అందరికి దర్శన భాగ్యం కల్పిస్తారు. ఇక్కడ స్వామి వారికి ఊంజల్ సేవ చేస్తారు. దీనినే డోలోత్సవం అంటారు. ఆ రోజు నుంచి మూడు రోజుల పాటు డోలాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ సంవత్సరం కూడా ఏటాలాగానే ఈ నెల 14 నుంచి 16 వరకు డోలాయాత్ర నిర్వహించనున్నారు.

ఆలయాని చేరుకోవడమిలా..

రాజాం పట్టణానికి 8 కిలోమీటర్ల దూరం..సంతకవిటి మండకేంద్రానికి 7 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. రాజాం నుంచి బస్సు సౌకర్యం ఉంది. రాజాం నుంచి మందరాడ, సంతకవిటి, మండాకురిటి బస్సు ద్వారా ఈ ఆలయానికి చేరుకోవచ్చు. ఆటోలు కూడా అందుబాటులో ఉంటాయి.

సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- అంబేడ్కర్ ఇండియా మిషన్, దళిత సంఘాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న అంబేడ్కర్ ఇండియా మిషన్, దళిత సంఘాల నేతలు భానుమూర్తి, రేగాన శ్రీనివాసరావు తదితరులు

విజయనగరం టౌన్: దళిత అధికారులపై చంద్రబాబు ప్రభుత్వం కక్ష పూరిత చర్యలు చేపట్టడం దారుణమని, కూటమి ప్రభుత్వం పలువురు దళిత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పోస్టింగులివ్వకుండా ఉద్దేశపూర్వకంగానే అవమానిస్తోందని, డీజీ ర్యాంకులో ఉన్న పీవీ.సునీల్ కుమార్‌పై ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చేపట్టడం విచారకరమని అంబేడ్కర్ ఇండియా మిషన్ ప్రతినిధులు బొంగ భానుమూర్తి, రేగాన శ్రీనివాసరావు, కె.భీమారావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక బాలాజీ కూడలి వద్దనున్న అంబేడ్కర్ భవన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 జూన్ 12 తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి నేటివరకూ సుమారు తొమ్మిదినెలల కాలంలో రాష్ట్రంలో ఉన్న దళిత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను టార్గెట్ చేస్తూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెడుతూ, నారా లోకేష్ తీసుకువచ్చిన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అములుచేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని మోడీ అమలుచేస్తే, రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేస్తూ తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో సోము మురళీమోహన్, పి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ధన్యవాదాలు

నెల్లిమర్ల: కార్మికుల శాంతియుత పోరాటంతో జూట్‌మిల్లు తిరిగిందని జూట్‌మిల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు అన్నారు. ఈ మేరకు సోమవారం మిల్లు తిప్పడానికి యాజమాన్యం నోటీసు జారీచేసి నిర్వహణ పనులు ప్రారంభించిన నేపథ్యంలో ఆయన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల శాంతియుత పోరాటం ఫలితంగా మిల్లు తిరుగుతుందన్నారు. అలాగే గడిచిన 9నెలలుగా యాజమాన్యం అక్రమంగా లాకౌట్ చేసి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసినా కార్మికుల శాంతియుత పోరాటంతో దఫా దఫాలుగా చర్చలు జరిపి ముందుగా బోనస్ సాధించి మిల్లు తిరగడానికి పార్టీల కతీతంగా కార్మికులు ఎంతో సహకరించారంటూ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా కార్మికులు ఇదే స్ఫూర్తిని కొనసాగించి సమస్యలు ఎదురైతే భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా రెండోరోజు జాతర

- కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తుల తాకిడి
- దేవస్థానంలో సామూహిక కుంకుమ పూజలు



అమ్మవారి దేవస్థానం మంటపంలో సామూహిక కుంకుమ పూజలు



శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు



రావిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న చిట్టి మాస్టర్

చీపురుపల్లి: భక్తుల కొంగు బంగారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 27వ జాతర మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం జాతర ఘనంగా కొనసాగింది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం నుంచి భక్తుల తాకిడి ప్రారంభమైంది. శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దివ్యంగా అలంకరించిన అనంతరం ప్రధాన అర్చకుడు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అర్చకులు హారతి ఇచ్చారు. అమ్మవారి దేవస్థానానికి వచ్చిన భక్తులు పసుపు, కుంకుమలతో అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రావిచెట్టు, ధ్వజస్తంభాల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. అలాగే దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారి దేవస్థానం మంటపంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

అలరించిన డ్యాన్స్ పోటీలు..

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు అలరించాయి. సోమవారం రాత్రి 7 గంటల నుంచి డ్యాన్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా డ్యాన్స్ మాస్టర్ చిట్టి వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో విశాఖపట్నం బృందం నిలవగా రూ.60 వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన హైదరాబాద్ బృందానికి రూ.40 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన బొబ్బిలి బృందానికి రూ.30 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన విజయనగరం బృందానికి రూ.20 వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు.

సంగాం ఆలయంలో భక్తుల రద్దీ

- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు



సంగమేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు



త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వంగర: మండల పరిధి సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో ఉన్న సువర్ణముఖి, వేగావతి, నాగావళి నదులు కలిసే కూడలి(త్రివేణి) సంగమం వద్ద పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించి సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. పితృదేవతలకు అధిక సంఖ్యలో భక్తులు పిండప్రదానాలు చేశారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మహిళా దినోత్సవం నిర్వహణపై సోమవారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా దినోత్సవంలో మహిళలందరినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రేరణ, సఖి కింద ప్రభుత్వ శాఖల్లో పదవులు అధిరోహించిన మహిళలు, పారిశ్రామిక వేత్తలు, విద్యావేత్తలు, క్రీడలు, వ్యవసాయంలో రాణించిన మహిళలు, సంగీత కళాకారులు, పారిశుద్ధ్యం, ఆశ, వైద్య రంగాలలో విశేష సేవలందించిన మహిళలందరినీ గుర్తించాలని సూచించారు. ఆ మహిళల ద్వారా ఇతరులు ప్రారణ పొందాలని అభిప్రాయపడ్డారు.

మహిళల ఎంపికలో పారదర్శకత అవసరం

మహిళల ఎంపికలో పారదర్శకత అవసరమని, అన్ని వర్గాలకు అవకాశం కల్పించాలని కలెక్టర్ చెప్పారు. అన్ని నియోజక వర్గాల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓసీ మిగిలిన అన్ని వర్గాలకు అవకాశం కల్పించాలని, మహిళలు తయారు చేసిన అన్ని రకాల ఉత్పత్తులు, తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం చేపడుతున్న న్యూట్రీకిట్ల పంపిణీ, పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన భవిత తదితర అంశాలు ఆవిష్కృతం కావాలని పిలుపునిచ్చారు.

నేడు హెల్దీ ఉమెన్.. హ్యాపీ ఉమెన్

ఈనెల 4న హెల్దీ ఉమెన్..హ్యాపీ ఉమెన్ పేరిట యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలు చేపట్టాలని, మండల స్థాయి విజేతలకు ఈనెల 6వ తేదీన, జిల్లా స్థాయిలో విజేతలకు ఈనెల 7వ తేదీన అవార్డుల ప్రదానం చేపట్టాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హేమలత, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, మెప్మా పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, పరిశ్రమల మేనేజర్ ఎంవీ కరుణాకర్, డీపీఆర్‌ఓ ఎల్.రమేష్, నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య, డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో మిమ్స్ వైద్య విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న మిమ్స్ చైర్మన్, ప్రతినిధులు

నెల్లిమర్ల: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన క్రీడాపోటీల్లో నెల్లిమర్లలోని మిమ్స్ హోమియో కళాశాల వైద్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ మేరకు సోమవారం మిమ్స్ పీఈటీ కె.వెంకటరావు మాట్లాడుతూ ప్రతిపాడు హెల్త్ యూనివర్సిటీ ఏఎస్ఆర్ హోమియో వైద్య కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్ కళాశాల క్రీడా పోటీల్లో మిమ్స్ హోమియో వైద్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ సాధించారని తెలిపారు. అలాగే పోటీల్లో పురుషులు, మహిళా జట్లు విజేతలుగా నిలిచాయని చెప్పారు. పురుషుల జట్టు క్రికెట్, టేబుల్‌టెన్నిస్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌లో బంగారు పతకాలు సాధించగా, మహిళా క్రీడాకారులు వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, పరుగుపందెంలో బంగారు పతకాలు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా మిమ్స్ చైర్మన్,మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి సత్యనారాయణరాజు, మేనేజింగ్‌ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్ వర్మ, డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రఘురాం, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాలరావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, హోమియోపతి వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, ఏఓ పి.గణేష్ పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

శబ్ద కాలుష్యం నివారించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవన రాణి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: శబ్ద కాలుష్యం నివారించాలని అందుకుగాను డీజేలు వంటి ప్రోగ్రాంలు నిరోధించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవన రాణి అన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వకూడదని తెలిపారు. అవసరం మేరకు మాత్రమే సెల్‌ఫోన్ వినియోగించాలని సూచించారు. మానవుడికి వినికిడి చాలా ప్రధానమైనదన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.రాణి, ఎన్‌సీడీపీఓ డాక్టర్ వీవీబీ సుబ్రహ్మణ్యం, డీపీఎంఓ డాక్టర్ సూర్యనారాయణ, డీఎంఓ మణి, డాక్టర్ వెంకటేష్, డెమో వి.చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

డీఏవీ స్కూల్ విద్యార్థి ప్రతిభ



సాధించిన షీల్డ్, సర్టిఫికెట్‌తో జయాన్

రాజాం సిటీ: స్థానిక డీఏవీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న హనుమంతు జయాన్ చక్కని ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్‌కు చెందిన విశ్వం ఎడ్యుటెక్ నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి, అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లో ప్రతిభకనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 2న జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీలో సీనియర్ విజువలైజింగ్ కేటగిరిలో ద్వితీయ స్థానం సంపాదించాడని పాఠశాల సిబ్బంది తెలిపారు. తన కుమారుడి ప్రతిభపట్ల రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావుతో పాటు కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

5 చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

- రూ.ఆరు లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పీఎస్ పరిధి జమ్ములో గత నెల 22న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఇంట్లో జరిగిన దొంగతనం కేసును రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు సదరు నిందితుడిని రూరల్ పోలీసులు అరెస్టు చేసి నిందితుడి దగ్గర నుంచి సుమారు రూ.ఆరు లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రూరల్ పీఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ, సీఐ లక్ష్మణరావు, ఎస్సై అశోక్‌లు ఈ విషయంపై మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాకు చెందిన చల్లా ప్రతాప్‌రెడ్డి రెండు తెలుగు రాష్ట్రాల్లో 5 దొంగతనాలకు పాల్పడ్డాడని చెప్పారు. గత నెల ఫిబ్రవరిలో జమ్ములో రిటైర్డ్ బ్యాంకు ఎంప్లాయి ఇనుగంటి సూర్యనారాయణ తన ఇంటికి తాళం వేసి పెళ్లి నిమిత్తం యలమంచిలి వెళ్లారు. అదే రోజున గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువాలో బంగారు అభరణాలను ఎత్తుకెళ్లారని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రిటైర్డ్ బ్యాంకు ఎంప్లాయి ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్సై అశోక్ సీఐ లక్ష్మణరావు సూచనలతో నిఘా పెట్టగా సోమవారం నగరంలోని విజ్ఞాన భారతి స్కూల్ వద్ద బాబామెట్ట ద్వారకనగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ప్రతాప్‌రెడ్డిని పట్టుకుని విచారణచేయగా దొంగతనం విషయం బయట పడింది. నిందితుడి దగ్గర ఒక బంగారు నెక్లెస్, ఒక హారం, నాలుగున్నర జతల చెవి దిద్దులు, జత గొలుసు, ఒక గోల్డ్ చైన్‌తో కలిసి మొత్తం రూ.6లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వివరించారు.